చివరి రోజు ప్రచార హోరు

పార్లమెంటు ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల అభ్యర్థులు చేస్తున్న ప్రచారం శనివారం చివరిరోజు తారాస్థాయికి చేరింది. సాయంత్రం వరకు బీఆర్ఎస్, బీజేపీ,కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులు, నాయకులు ఓటర్లను కలుస్తూ ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమదే విజయం అని అభ్యర్థులు ధీమాగా ఉన్నారు.

చక్రపాణికి సన్మానం



మేడ్చల్: పీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది బర్మా చక్రపాణిని మేడ్చల్ న్యాయస్థానాల న్యాయవాదులు, కాంగ్రెస్ నాయకుడు కోలను హన్మంత్‌రెడ్డి సన్మానించారు. చక్రపాణి కార్యాలయంలో ఆయన్ను న్యాయవాదులు ,నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అభ్యర్థుల విజయం కోసం మహామహుల ప్రచారం

మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్ నియోజకవర్గంలో తమ పార్టీల తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల గెలుపునకు పార్టీల అగ్రనేతలు ప్రచారాలు నిర్వహించారు. చివరి దాకా పెండింగ్‌లో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి సునీత రెడ్డి మొదట్లో ప్రచారంలో వెనుకబడ్డా చివరి వరకు జోరు అందుకున్నారు. మల్కాజిగిరి బరిలో కాంగ్రెస్ తరుపున సునీతమహేందర్ రెడ్డి, బీజేపీ తరుపున ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరుపున రాగిడి లక్ష్మారెడ్డిలు పోటీలో ఉన్నారు. ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల నాయకుల ప్రచారం మేడ్చల్ లో కనిపించలేదు. కాంగ్రెస్ తరపున సీఎం రేవంత్‌రెడ్డి మూడు చింతలపల్లిలో సభ నిర్వహించి ప్రచారం చేయగా, అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు రోడ్ షోలు నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి మల్లారెడ్డిలు లు ప్రచారం చేశారు. అభ్యర్థి లక్ష్మారెడ్డి అక్కడక్కడా రోడ్ షోలు నిర్వహించారు. ఇక బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఇతర ఉత్తర భారత బీజేపీ నాయకులు, బీజేపీ కోసం పని చేశారు. దాదాపు నెల రోజుల పాటు ప్రచారాలతో ఉక్కిరి బిక్కిరి అయిన నాయకులు ఓటర్లు శనివారం సాయంత్రం మైకుల మోత మూగబోవడంతో బిజీ జీవితం నుండి ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా ప్రపంచ నర్సుల దినోత్సవం



ఘట్‌కేసర్: వైద్యసేవలు అందించే నర్సుల సేవలు వెలకట్టలేనివని నీలిమా ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీలిమా అన్నారు. వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రిలో ప్రపంచ నర్సుల దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భరత్ రెడ్డి, వైద్యసిబ్బంది, ఆస్పత్రి నర్సులు పాల్గొన్నారు.

హరివర్ధన్‌రెడ్డిని కలిసిన కౌన్సిలర్లు



మేడ్చల్: రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన ఇద్దరు మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డిని కలిశారు. నగరంలోని బోయిన్‌పల్లిలో హరివర్ధన్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు కొడే మహేష్, జంగా హరికృష్ణయాదవ్‌లు కలిశారు. మండల కాంగ్రెస్ నాయకుడు బాల్‌రెడ్డి,మధుకర్‌యాదవ్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

వాయిదాలు చెల్లిస్తుంటే అనర్హుడిని ఎలా అవుతాను

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘంలో తీసుకున్న రుణం వాయిదాలు సక్రమంగా చెల్లిస్తుండగా అనర్హుడిని ఎలా అవుతానని ఆ సంఘం డెరెక్టర్ ఛందుపట్ల ధర్మారెడ్డి ప్రశ్నించారు. ఘట్‌కేసర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ సంఘం నిబంధనల మేరకే రుణం తీసుకున్నానని, కరోనా ఇబ్బందులతో రెండు వాయిదాలు చెల్లించలేదన్నారు. బీరెడ్డి స్రవంతిరెడ్డికి వ్యవసాయ భూమి లేకున్న డైరెక్టర్‌గా కొనసాగుతుందని, నా ఫిర్యాదుతో ప్రాథమిక సభ్యత్వం కోల్పోయి ఆరోపణలు చేస్తుందన్నారు. అధికారులకు తప్పుడు సమాచారమిచ్చిన ఆమె బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది



జవహర్‌నగర్ పోలీసులు కవాతు చేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కుషాయిగూడ ఏసీపీ మహేష్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ బాలాజీనగర్‌లో జవహర్‌నగర్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుషాయిగూడ ఏసీపీ మహేష్ హాజరై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటును వేయాలని కోరారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అడ్మిన్ ఎస్‌ఐ ఇద్రీస్ అలీ, ఎస్‌ఐ అనిల్‌కుమార్‌యాదవ్, కేంద్ర బలగాలు, జవహర్‌నగర్ పోలీసులు పాల్గొన్నారు.

రూ.18.30 లక్షలు స్వాధీనం

కీసర: ద్విచక్రవాహనంపై తీసుకెళుతున్న రూ 18.30 లక్షల నగదును కీసర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. నగరం నుండి అవుటర్ రింగు సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనంపై పెద్ద మొత్తంలో నగదును తీసుకు వస్తున్నట్లు ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం కరీంగూడ చౌరస్తాలో నిఘా పెట్టారు. పల్సర్‌బైక్‌పై సాయికుమార్, కార్తీక్ రూ 18.30 లక్షలనగదుతో పట్టుపడ్డారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. పోలీసులు నగదును స్వాధీనం చేసుకొని నమోదు చేశారు.

బీజేపీ

ఘట్‌కేసర్‌లో బీజేపీ ర్యాలీ



ఎదులాబాద్‌లో ప్రచారం





కండ్లకోయ కు ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ హంస కృష్ణగౌడ్

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు అన్నారు. ఎదులాబాద్, ఘనాపూర్‌లో బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు హనుమాన్ ఆధ్వర్యంలో కొండాపూర్, ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహించారు.

మేడ్చల్ : మేడ్చల్ మున్సిపాలిటీ, గుండ్లపోచంపల్లి, మండలంలోని వివిధ గ్రామాలలో ప్రాంతంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారాలు, ర్యాలీలతో నాయకులు హోరెత్తించారు. నాయకులు శనివారం ఉదయం ఆరు గంటల నుండి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్

చీర్యాల గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ



మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు





ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కీసర: కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి ఓట్లు వేయాలని కోరుతూ శనివారం నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతో పాటు, చీర్యాల, కీసర తదితర గ్రామాల్లో కాంగ్రెస్‌నేతలు ర్యాలీలు, నిర్వహించారు. చీర్యాల గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కోలకృష్ణాయాదవ్‌లు పాల్గొన్నారు. నాగారం మున్సిపల్ వైస్ చైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్, పట్టణకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ముప్పుశ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ : శనివారం మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు శనివారం ఉదయం ఆరు గంటల నుండి ప్రచారం మొదలుపెట్టారు. ఉదయమే బ్యాండు బాజాలతో అన్ని వార్డులలో ర్యాలీలు నిర్వహించారు. పార్టీకి చెందిన కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, సీపీఐ నాయకులు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బ్యాండు బాజాలతో ఇళ్ళ ముందుకు వెళ్ళి కరపత్రాలు అందజేసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పలు వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించి తమ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా మున్సిపాలిటీలో ఆ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అవుషాపూర్‌లో గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు జంగయ్య ముదిరాజ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్



దమ్మాయిగూడలో ప్రచారంలో పాల్గొన్న మల్లారెడ్డి



ఘట్‌కేసర్ ర్యాలీలో ...



కీసర: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపొందడం ఖాయమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మెన్ వసుపతి ప్రణీతాగౌడ్, పార్టీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి విజయం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. చౌదరిగూడ, ఘట్‌కేసర్‌లో శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అంటేనే కరువుకు నిదర్శనంగా మారిందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శనివారం బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపాలిటీలో రోడ్ షోలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడంతో కొద్ది రోజుల్లో కరెంట్ సమస్య, తాగునీటి సమస్య తలెత్తాయన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్‌తో పోలింగ్ సిబ్బంది కేటాయింపు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో పోలింగ్ సిబ్బంది కేటాయింపులకు సంబంధించి మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం కలెక్టరేట్‌లో జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ ఎంఎస్ ప్రియాంకశుక్లా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ..ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వారు పేర్కొన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 2,425 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మూడవ విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చే శారు. ఐదు నియోజక వర్గాలకు 2,860 టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓ పి ఓలను కూడా కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ,డీఈఓ విజయకుమారిసంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓటేసేందుకు బైలెల్లారు.!



సుభాష్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు నగర ప్రజలు తమ సొంత ఊళ్లకు పయనమయ్యారు. ఇంజినీరింగ్ కళాశాలకు మూడు రోజులు సెలవు ప్రకటించడంతో సొంతఊళ్లకు వెళ్లేందుకు బస్ స్టాప్ ల వద్ద శనివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నగరం నుండి జిల్లాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులో కిక్కిరిసిపోయారు. మరి కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన కేసులో నలుగురి అరెస్టు



నకిలీ డాక్యుమెంట్ సృష్టించి విక్రయించిన కేసులో నిందితులు

కీసర: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరులకు ఇంటిని విక్రయించిన కేసులో కీసర పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన మేరకు.. నగరానికి చెందిన మున్నిరాణి తండ్రి పేరుమీద రాంపల్లి లక్ష్మీనగర్‌లో 500 గజాల ఇంటి స్థలం ఉంది. విలువైన ఈస్థలాన్ని కొట్టేయాలనే ఉద్దేశంతో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి రాజేంద్రప్రసాద్, సచిన్ అలియాస్ సాయి, సంగీత, మణికంఠ పథకం ప్రకారం కూలీగా పనిచేసే లాలాపేటకు చెందిన పద్మపేరు మీద నకిలీ డాక్యుమెంట్ సృష్టించారు. మొదట రాజేంద్రప్రసాద్ రిజిస్ట్రేషన్ చేసుకొని రూ 40 లక్షలకు మాదాడి యుగేందర్ రెడ్డికి అక్రమంగా విక్రయించారు. యుగేందర్ రెడ్డి పదిహేను రోజుల వ్యవధిలోనే రూ 60 లక్షలకు వైశాలికి విక్రయించాడు. ఈ పథకంలో మహేష్, సోమనాథ్ ప్రధాన సూత్రదారులు వీరితోపాటు, ఎం. ఆంజనేయులు, రామ్‌సింగ్ యుగేందర్‌రెడ్డి పరారీలో ఉన్నారు. ఈ కేసును కీసర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుంటున్న యువకుడిని కాపాడిన పోలీసులు

జగద్గిరిగుట్ట: ఉరి వేసుకుంటున్న ఓ యువకుడిని జగద్గిరిగుట్ట పోలీసులు కాపాడారు. అంజయ్యనగర్‌కు చెందిన సాయికుమార్ వ్యక్తిగత కారణాలతో తాను చనిపోతున్నానని ఏలూరులో ఉంటున్న తన బావ అనిల్‌కు ఫోన్ చేశాడు. వెంటనే అప్రమత్తమైన అనిల్ ఈ విషయాన్ని జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సాయికుమార్ ఉంటున్న అడ్రస్‌ను కనుక్కుని ఉరి వేసుకుంటున్న అతడిని కాపాడి స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన సీఐ క్రాంతి, పెట్రోలింగ్ సిబ్బంది గోపాల్, వినయ్‌లకు సాయికుమార్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

మోతీనగర్: అనారోగ్యంతో ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి మృతి చెందాడని ఎంసీహెచ్ఎస్ మాజీ అధ్యక్షుడు నలమాల్పు అంజిరెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటనా స్థలానికి వచ్చిన బాలనగర్ క్లూస్ టీమ్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్థానికుల నుంచి సమాచారం సేకరించారు. మృతుడు మహబూబ్ నగర్‌కు చెందిన కిషన్‌గా గుర్తించారు. కిషన్‌కు ఎవరూ లేకపోవటంతో కూలీ పనులు చేసుకుంటూ మోతీనగర్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌పై జీవనం కొనసాగిస్తున్నాడని తోటి కార్మికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6లక్షల మద్యం స్వాధీనం

మోతీనగర్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా శుక్రవారం రాత్రి అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కైత్లాపూర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రూ.6లక్షల విలువైన మద్యం లభించిందని ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లికి చెందిన ఏ1గా వినయ్‌గౌడ్, ఏ2గా వివేకానందనగర్‌కు చెందిన అనిల్, ఏ3గా అమీర్‌పేటకు చెందిన గోవింద్ సైదులు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

‘బీజేపీకి బుద్ధి చెప్పండి’



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతోసహా దాని మిత్ర పక్షాలను ఓడించాలని ఓటర్లను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఎం కార్యదర్శి పి.సత్యం కోరారు. శనివారం శామీర్‌పేటలోని జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఎన్నికల ప్రసంగాలు చూస్తుంటే.. ఓటమి భయంతో ఆత్మరక్షణలో పడినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో ఉన్నవారంతా దేశ ద్రోహులని బీజేపీ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీకి దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తున్నామని, సీపీఎం జిల్లా నేత, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కోమటి రవి తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు జె.చంద్రశేఖర్ ఎం.వినోద,ఎర్ర అశోక్, రాథోడ్ సంతోష్, ఎం. నరేష్, కిష్టప్ప, ఎల్లయ్య పాల్గొన్నారు.

పరిశ్రమలు తరలిపోతున్నాయి!

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి పరిశ్రమలు పోటెత్తాయని... నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-2, జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్, సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్, రంగారెడ్డినగర్, చింతల్ డివిజన్లు, జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లలో రోడ్‌షోలు నిర్వహించారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని పదేళ్లగా ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఎంపీగా లక్ష్మారెడ్డిని గెలిపిస్తే మరింత అభివృద్ధి పరుస్తామన్నారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటుందనే గ్యారంటీ లేదన్నారు. కుర్చీలను కాపాడుకోవడమే తప్ప రాష్ట్రాభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డికి పట్టడం లేదన్నారు.